ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025
5
కర్నూలు

క్లస్టర్ వర్సిటీలో 22 పీజీ కోర్సులు

- డ్రోన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్సెస్ కోర్సులు - అధునాతన పద్ధతిలో విద్యాబోధన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిగ్రీ కోర్సు పూర్తి చేసిన తర్వాత పీజీ కోర్సులకు వెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. క్లస్టర్ వర్సిటీ పరిధిలో దాదాపుగా 22 పీజీ కోర్సులను అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుండి డ్రోన్స్ , ఐఓటి, ఎంఎస్సి ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ డైటీషన్ కోర్సులను కూడా విద్యార్థులకు అందుబాటులో వచ్చినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ రెండు క్లస్టర్ వర్సిటీలను నెలకొల్పారు. అందులో భాగంగా దక్షిణ భారతదేశంలో కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల , ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలను కలిపి క్లస్టర్ వర్సిటీగా 2020 సంవత్సరంలో నెలకొల్పారు. ఈ మూడు కళాశాలలు క్లస్టర్ వర్సిటీ ఆధీనంలో ఉన్నాయి. యూనివర్సిటీ పరిధిలో అనుభవమున్న అధ్యాపకులు ఉన్నత విద్యా కోర్సులు పూర్తి చేసిన వారే ఉన్నారు. ఇక్కడ ఉన్నటువంటి అధ్యాపకులు అంతా రీసెర్చ్ స్కాలర్స్ గా ఉన్నటువంటి వారు. అలాంటి వర్సిటీ పరిధిలో దాదాపుగా 22 పీజీ కోర్సులను విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. అందులో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ తెలుగు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ ,మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ,ఎంఏ రూరల్ డెవలప్మెంట్, ఎంఏ హిస్టరీ, ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, మాస్టర్ ఆఫ్ కామర్స్ లాంటి ఆర్ట్స్ విద్యార్థులకు పీజీ కోర్సులు అభ్యసించేందుకు ఉన్నాయి. ఎంఎస్సి బయోటెక్నాలజీ , మైక్రో బయాలజీ , ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ అండ్ డైటీస్, బాటనీ , జువాలజీ , మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఫిజిక్స్ , అనలిటికల్ కెమిస్ట్రీ , ఎంఎస్సి ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సి సైకాలజీ , కంప్యూటర్ సైన్స్ , డ్రోన్స్ అండ్ ఐఓటి తదితర కోర్సులు సైన్స్ విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. అలాగే పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు అధునాతనమైన వసతులను కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా సైన్స్ కోర్సులకు అధునాతనమైన ల్యాబులు ఉన్నాయి. ఇక్కడ అందుబాటులో ఉన్న కోర్సులు కూడా విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేందుకు అవకాశం ఉన్నట్లు వర్సిటీ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నూతన ఆవిష్కరణలతో కూడిన విద్యాబోధన

క్లస్టర్ వర్సిటీ పరిధిలో ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులకు అనేక పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు నూతన ఆవిష్కరణలతో కూడిన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తున్నాం. వర్సిటీ పరిధిలో ఉన్నటువంటి ఫ్యాకల్టీ కూడా రీసెర్చ్ స్కాలర్స్ ఉన్నారు.

- కట్టా వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్, క్లస్టర్ వర్సిటీ.

పోరాట పటిమగల నాయకుడు మహానంద రెడ్డి

- మహానందరెడ్డి సంస్మరణ సభలో వి.వెంకటేశ్వర్లు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, వేదికపై జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తదితరులు

ప్రజాశక్తి-ఆదోని

శ్రామిక ,ప్రజా పోరాట పటిమగల నాయకుడు మహానంద రెడ్డి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, పలువురు నాయకులు అన్నారు. మహానంద రెడ్డి సంస్మరణ సభ సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్ గోపాల్ అధ్యక్షతన ఆదివారం ఆదోని మంగళఅనంత ఆంజనేయ స్వామి ఆలయ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముందుగా మహానంద రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఎన్‌టిసి మిల్లులో కార్మికునిగా మహానందరెడ్డి పని చేస్తూ సిఐటియు కార్మికుల కోసం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. అత్యంత పోరాట పటిమ, సిద్ధాంత నిబద్ధత, ప్రజల పట్ల అచంచలమైన విశ్వాసం కలుగిన మంచి కార్మిక సంఘం నాయకులు మహానంద రెడ్డి అని కొనియాడారు. మేనేజ్‌మెంట్‌తో కార్మికుల హక్కులకోసం రాజీలేని పోరాటం చేసిన అసలు సిసలైన కార్మిక నాయకుడు, కార్మిక పక్షపాతిగా , నిరంతరం ప్రజా పోరాటాలు చేసిన మహానంద రెడ్డి అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమన్నారు. ఇది కార్మిక వర్గానికి తీరనిలోటన్నారు. వీధులలో, వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయడంలో గట్టి కృషి చేశారన్నారు. పట్టణంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పనిచేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. ఇటువంటి గొప్ప నాయకుడి ఆశయాలు ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎసి శ్రీకాంత్ రెడ్డి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అశోక్ నంద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు అజయ్ బాబు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మల్లికార్జున, మెట్రో షూస్ అధినేత శంకర్‌రావు తదితరులు మహానంద రెడ్డి చేసిన ప్రజా పోరాటాల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు ,రాధాకృష్ణ, సిపిఎం పట్టణ మండల కార్యదర్శిలు లక్ష్మన్న లింగన్న, సిపిఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కలుబావి రాజు, వీరేష్, ఐఎన్‌టియుసి నాయకులు ఎంకప్ప, ఎఐటియుసి నాయకులు ఎంకన్న, నాగ రాజు, పిఒ డబ్ల్యు మహిళా సంఘం నాయకురాలు మన్నెమ్మ, పట్టణ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, వీరారెడ్డి, రామాంజ నేయులు, ఉచ్చీరప్ప, నాయకులు బి.వెంకటేష్, వీరేష్, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, ఈరన్న, వెంకటేశులు, నాగరాజు అజీమ్ ఖాన్, వెంకటేశులు, మునెప్ప, బాష, హనుమంత రెడ్డి, పాండురంగ, అయ్యన్న, అయ్యప్ప, మహానంద రెడ్డి కుటుంబ సభ్యులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు శ్రీశ్రీ

శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న పిఎన్ఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

శ్రీశ్రీ సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన మహాకవి, గొప్పదార్శినికుడని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపి బసవరాజు కొనియాడారు. ఆదివారం కర్నూలు పాత బస్తిలోని సుజిత్ భవన్‌లో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ.రాజు అధ్యక్షతన శ్రీశ్రీ 42వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. జయహో శ్రీశ్రీ ప్రజానాట్యమండలి స్వర నిరాజనం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు రాంబాబు భక్తులను ఆహ్వానించగా వక్తలు ఆసీనులయ్యారు. ముందుగా ఎంపీ బసవరాజు మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం, ఖడ్గసృష్టి రచయితగా విరసం అధ్యక్షుడిగా అభ్యుదయ సాహిత్యాన్ని తెలుగు నాట ప్రవహింప చేసిన కలం శ్రీశ్రీ అని చెప్పారు. శ్రీశ్రీ రాసిన సినిమా పాటలను ఉదహరిస్తూ అనేక గీతాలను ఆలపించి సభికులను ఉత్తేజ పరిచారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదివి ఉత్తేజం పొందామని నేటి యువత ఆ సాహిత్యాన్ని అవగాహన చేసుకుని సమాజాన్ని అర్థం చేసుకోవాలని చెప్పారు. లోకేష్ ఆలపించిన పొలాలన్నీ హలాల దున్నిపాట సభలో ప్రేక్షకులు అందరూ ఆలపించి ఉత్తేజపరిచారు. తెలుగువీర లేవరా అంటూ బాలు, ఉందిలే మంచి కాలం అంటూ నోమేశ్వరి, కణకణ మండే సూర్యుడు అంటూ ఆశన్న పాటలు పాడి ఆ మహాకవికి స్వరనీరాజనం అర్పించారు. బతుకమ్మ వందన సమర్పణ తో సభ ముగిసింది. ఈ కార్యక్రమంలో బజారి, మహేంద్ర ,రామకృష్ణ, సరిత, లక్ష్మి, వేణమ్మ, నాయకులు షరీఫ్, పార్వతయ్య నాగస్వాములు శ్రీశ్రీ అభిమానులు, 50 మంది కళాకారులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలివ్వాలి

- రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

104 ఉద్యోగుల పెండింగు వేతనాలు వెంటనే విడుదల చేయాలని 104 రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు జిల్లా సిటియు కార్యాలయంలో జిల్లా 104 ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 104 రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు చెల్లించాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుతం 104 సర్వీస్ లు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. 104 జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దయ్య మాట్లడుతూ ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని అన్నారు. అదే విధంగా వాహనాలు గత ఐదు సంవత్సరాలనుండి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు మాట్లాడారు. కార్యక్రమంలో 104 జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ , కళ్యాణి , సీనియర్ నాయకులు జోజప్ప ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

గూడూరు తహశీల్దార్ కార్యాలయం పట్టదా..?

- అమలుకు నోచని హామీలు
- గత్యంతరం లేక బ్రిటీష్ కాలం నాటి భవనంలో సేవలు

శిథిలా వస్థలో గూడూరు తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి- గూడూరు

గూడూరు పట్టణానికి రెవెన్యూ కార్యాలయం విశిష్ట సేవలు అందించడంలో ప్రత్యేకత ఉంది. అలాంటి గూడూరులో రెవిన్యూ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి నోచుకోవడం లేదు. పాత భవనం నేడు శిథిలమై భవనం ఆనవాళ్లు కోల్పోయింది. అదే భవనం 1987లో అప్పటి రాష్ట్ర భారీ , మధ్య తరహా నీటి పారుదల శాఖమాత్యులు కెఇ. కష్ణమూర్తి చేతుల మీదుగా అప్పటి కలెక్టర్ మృత్యుంజయ, కోడుమూరు అప్పటి ఎమ్మెల్యే శిఖామణి సమక్షంలో ప్రస్తుత రాష్ట్ర న్యాయశాఖమంత్రి మంత్రి ఎన్ఎండి ఫరూక్ , పురపాలక శాఖసంఘ మంత్రి బివి మోహన్‌రెడ్డి నూతన భవనం ప్రారంభించినట్లు అక్కడి శిలాఫలకం దర్శనమిస్తోంది. ఇప్పటికి సరిగ్గా 37 యేళ్లు కాగా ఆరేళ్ళ క్రితం పెచ్చులూడి అధికారుల, సిబ్బంది విధులకు సేవలకు ఆటంకం కలిగించేది. 2018లో ఎడతెరపి లేని వర్షాలకు శిథిలమైన భవనం ఒక్కసారిగా కూలిపోయింది. అదే సమయంలో జిల్లా ఉన్నతాధికార వర్గం తక్షణమే నూతన భవనం నిర్మించాలని రూ.90 లక్షలు ప్రకటించారు. 2019లో ఎన్నికలు ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కావడం నాయకుల్లో ఐక్యత లేక, కాబట్రాక్టర్ల అయిష్టానికి ఆ నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో నూతన నిర్మాణం కనీసం ప్రస్తావనకు రాలేదు. గత్యంతరం లేక ప్రక్కనే బ్రిటిష్ కాలం నాటి భవనంలోకి మార్పు చేయాల్సి వచ్చింది. ఆరేళ్లుగా ఇరుకు భవనంలో ఇరుకు గదులలో విధులకు, ప్రజల సేవలకు అనుకూలంగా లేనప్పటికి సర్దుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. కొంత మంది విఆర్‌ఒలు సొంత ఖర్చులతో అద్దెషాపులు తీసుకోని భరిస్తున్నారు. మరి కొంతమంది వి ఆర్‌ఒలు ఆరు బయట చెట్ల కిందే విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు లేక పోవడం సిగ్గు చేటుగా ఉంది. అదే మహిళా అధికారులు, ఉద్యోగులు , అక్కడికి వచ్చి వెళ్లే మహిళలు , యువత పడరాని పాట్లు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కోడుమూరు అయినప్పటికీ రిజిస్టర్ కార్యాలయం, ఎన్నికల నామినేషన్, కీలక కార్యాలయాలకు కేంద్ర బిందువుగా గూడూరు విశిష్టత సంతరించుకొంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో అసమర్థత వెరసి ఇక్కడి కార్యకలాపాల సేవా కేంద్రాలను కర్నూలుకు తరలించారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు చొరవ చూపి రెవిన్యూ భవనం నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని రావల్సిన అవశ్యకథ ఎంతయినా ఉందని పలువురు మేధావులు, ప్రజా సంఘాలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

తహశీల్దార్ కార్యాలన్ని వెంటనే నిర్మించాలి

గూడూరు మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడం దురదృష్టకరం. పాతది శిథిలమవడంతో కొంతకాలం ఎంపిడిఒ కార్యాలయంలో నడిపారు. అక్కడ వసతులు లేక బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనంలో తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు వేసేవారు. 2024 ఎన్నికలు సందర్భంగా గూడూరులో కార్యాలయం లేకపోవడంతో నామినేషన్లు కర్నూలులోని ఆర్‌డిఒ కార్యాలయంలో వేయించడం చాలా బాధాకరమైన విషయం. మండలంలోని గ్రామాల నుండి రైతులు, ప్రజలు నిత్యం కార్యాలయానికి వస్తుంటారు. గతంలో ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. ప్రస్తుత టిడిపి కూటమి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి అధికారులు తీసుకువెళ్లినా నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా ఎంతో చరిత్ర కలిగిన గూడూరు మండల కేంద్రంలో వెంటనే తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించాలి.

- జె.మోహన్, సిపిఎం గూడూరు ప్రాతీయ కార్యదర్శి.

క్రీడలతో క్రమశిక్షణ

- 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మాలతా రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు ప్రారంభించి తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్నారులకు తైక్వాండోలో బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే జీవితంలో క్రమశిక్షణ అలవాటు అవుతుందన్నారు. మార్షల్ ఆర్ట్స్ వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. శుభ్రమైన ఆహారం, నీరు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తైక్వాండో శిక్షకుడు టి అజయ్, టి.తేజ, చిన్నారులు, తైక్వాండో కర్నూలు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్మశాన వాటికలలో సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : గ్రామాల్లోని దళితుల స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మురకల ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో దళితుల స్మశాన వాటికలలో అనేక సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించడంలో గ్రామపంచాయతీ అధికారులు చొరవ చూపడం లేదన్నారు . పాలకొల్లు, మీదివేముల, బైరాపురం ఇతర గ్రామాలలో స్మశాన వాటికల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి గ్రామాలలో స్మశానవాటికల్లో ఉన్న సమస్యలు పరిశీలించి ముళ్ళపొదలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు రామకృష్ణ ,మద్దిలేటి, కృష్ణుడు, మద్దిలేటి, అన్నయ్యలు చిన్న మాదన్న పాల్గొన్నారు.

కరాటే, సిలంబం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల క్రీడోత్సావాలలో భాగంగా ఆదివారం కర్నూలు స్టేడియంలో జరిగిన కరాటే, సిలంబం మార్షల్ ఆర్ట్స్ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా ఒలంపిక్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సునీల్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలని, గత 15 సంవత్సరాలుగా క్రీడా స్ఫూర్తిని చాటే ఉద్దేశంతో ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహస్తునామన్నారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలవాలని అయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, మాస్టర్స్ చంద్రశేఖర్, రమణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, గయాజుద్దీన్, షకీల్ అహ్మద్, మున్నాఫ్ పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో వేముగోడు ప్రతాపరెడ్డి ప్రతిభ

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : నీట్ పరీక్ష ఫలితాల్లో గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి చెందిన రంగారెడ్డి రాధమ్మ దంపతుల కుమారుడు కె. ప్రతాపరెడ్డి నీట్ ప్రవేశ పరీక్షలో 494/720 మార్కులు సాధించాడు. 59,060 ఆల్ ఇండియా ర్యాంకు రాగా, కేటగిరి రాంకు 7294 వచ్చినట్లు తెలిపారు. ఆల్ ఇండియా ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అనుగొండ టిడిపి లీడర్ రామకృష్ణారెడ్డి అల్లుడుని అభినందించి భవిష్యత్తులో డాక్టర్‌గా పేద ప్రజలకు సేవలు చేయాలని కోరారు.

విద్యార్థి ప్రతాపరెడ్డితో టిడిపి లీడర్ రామకృష్ణారెడ్డి

పెట్టుబడి గ్రంథాన్ని చదవటానికి ప్రేరణ 'సిందూరం'

- సిందూరం కవితా సంపుటి పరిచయ సభలో ప్రసాదమూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కారల్‌మార్క్స్ పెట్టుబడి గ్రంథాన్ని మరో కోణంలో చదవడానికి ప్రేరణ 'సిందూరం' అని ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ ప్రసాదమూర్తి అన్నారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ఉన్నం వెంకటేశ్వర్లు, ఉష రచించిన ' సిందూరం' పెట్టుబడి కవితల కట్టుబడి అనే పుస్తక పరిచయ సభ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన సిందూరం కవితా సంపుటిని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి ప్రసాదమూర్తి మాట్లాడుతూ రచయిత పున్నం వెంకటేశ్వర్లుతో ఉన్న పరిచయాన్ని ఆయన వివరిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకుడిగా యూనివర్సిటీలో కమ్యూనిజం గురించి కవిత్వం రాయాలనేవారన్నారు. ప్రజాశక్తిలో తాను సబ్‌ఎడిటర్‌గా పని చేస్తున్నప్పుడు, కలిసి పని చేశామన్నారు. ఎడిటోరియల్ బోర్డు సభ్యులుగా, ప్రజాశక్తి జర్నలిజం స్కూలుకు ప్రిన్సిపల్‌గా వివి పని చేశారన్నారు. పట్టుదల గల వ్యక్తి మానసిక బలాఢ్యుడని కొనియాడారు. మనుషులు ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని చెప్పారు. మానవజాతి చరిత్ర అజేయమన్నారు. సింధూరంలో పెట్టుబడి కీలక అంశమన్నారు. కవి పెట్టుబడి అనే అంశాన్ని కవిత్వంలో అన్వయించడం చాలా సాహసోపేతమైన పని అన్నారు. సిందూరమనే కవితా సంపుటిలో సరళంగా రాశారని, పెట్టుబడిని కవిత్వంలోకి తీసుకురావడంలో సఫలీకృతం అయ్యారని పేర్కొన్నారు.

'ఇది స్త్రీ నుదిటి సిందూరం కాదు/ శ్రమశక్తి వాటామార్పుకు/ తెగువచూపే కష్టజీవుల/ బలగాలు చేసే యుద్ధాల/ నుదిటిపై దిద్దిన పోరాటాల కొత్త సందూరం' అని ఉన్న వెంకటేశ్వర్లు కవితలో చెప్పారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పెట్టుబడులు మతతత్వాలకు నిలయంగా మారాయని అన్నారు. ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వస్తువుగా ఉపయోగించారన్నారు. పెట్టుబడి ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో వివరించారన్నారు. మానవ సమాజానికి పెట్టుబడికి ఉన్న సంబంధం గురించి సిందూరం పేరుతో చక్కగా రాశారన్నారు. మార్క్స్ క్యాపిటలిజం గురించి చెప్పడంతోపాటు సమాజంలో జరుగుతున్న విషయాలను సిందూరంలో ఉద్వేగ భరతమై విషయం తీసుకున్నా రన్నారు. విధ్వంస చర్యలను గురించి వివరించారని చెప్పారు. సమసమాజ భావ జాలాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి ప్రయత్నించా రని చెప్పారు. ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ ఇంచార్జి పానుగంటి చంద్రయ్య మాట్లాడుతూ ఉన్నం వెంకటేశ్వర్లు , ఉష ఎల్లప్పుడూ పత్రికల్లో కొత్తదనం ఉండాలని సూచించేవారని, పట్టుదల, క్రమశిక్షణ గలవ్యక్తులని అన్నారు. సిందూరం కవితా సంపుటిలో సరళమైన బాషలో, అర్థవంతమైన పదాల పొందికతో అందరినీ చదివించ దగినదిగా ఉందని చెప్పారు. మార్పు అనివార్యం అని కొత్తకోణంలో చెప్పిన ఈ పుస్తకాన్ని చదవాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ మానవ సమాజ మార్పును కోరుకునే మార్క్స్ పెట్టుబడిని గ్రంథాన్ని కవిత్వంలో రాయడం గొప్ప పని అన్నారు. మనిషికి మనిషిని దూరం చేసే సమాజంలో మనం ఉన్నామన్నారు. బలమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల చక్రపాణి ఉన్నం వెంకటేశ్వర్లు ఉషాలో పంపిన సందేశాలను చదివి వినిపించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో శ్రీశ్రీ అభిమానులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద మూర్తి

చదరంగంతో చదువులోనూ రాణిస్తారు

- సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచే చెస్ క్రీడలో సాధన చేయడం వల్ల వారు చదువులోనూ మరింత రాణిస్తారని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఒలంపిక్ డే వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెస్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ చదరంగంగా పిలువబడే చెస్ క్రీడ పురాణాల కాలం నుంచి ప్రాచుర్యంలో ఉందని చెప్పారు. మిగతా క్రీడలతో పోలిస్తే చెస్‌క్రీడా వ్యక్తిగత సామర్థ్యంతో రాణించే క్రీడని వివరించారు. చెస్ క్రీడలో పాల్గొనడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని,ఎదుటివారి ఎత్తుగడలను పసిగట్టే ఆలోచన శక్తి కూడా పెరుగుతుందని చెప్పారు. చెస్ క్రీడ వల్ల నిశ్శబ్దంలో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల ఆలోచనశక్తి పెరిగి సైన్స్ లోనూ రాణించే అవకాశం ఉందని తెలిపారు. ఒకరకంగా చెప్పాలంటే సాధన చేయడం వల్ల జీవితం పై అవగాహన కలుగుతుందని వివరించారు . చెస్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే పూర్తి సమయం దానికి కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అలా కాకుండా తాత్కాలికంగా ఈ క్రీడలో సాధన చేసి చదువులోనూ రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు క్రీడలకే పరిమితం కాకుండా సమాజం పట్ల అవగాహన పెంపొందించుకొని జీవితంలో ముందుకు సాగాలని డాక్టర్ శంకర శర్మ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయక్, రేణుక ,చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ఐక్యమత్యంతో సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఐక్యమత్యంతో సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు అన్నారు. సచివాలయంలో హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తూ ఎంపిహెచ్‌పి (ఎఫ్) ప్రమోషన్ పొందిన వారు ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్‌లో అభినందన సభ యూనియన్ నాయకులు సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా మనం ప్రమోషన్ పొందామని అన్నారు. రానున్న కాలంలో కూడా అందరు ఐక్యమత్యంతో ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల మొండి వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. పని భారాన్ని పెంచుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పని విధానాన్ని పెంచుతూ క్యాబినెట్ నిర్ణయం చేసిందని, దీనివల్ల రాబోయే కాలంలో పని భారం పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జులై9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, సిఐటియు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఏసురత్నం తదితరులు మాట్లాడుతూ ఐక్యమత్యంతో పట్టుదలతో పోరాటం వల్లే మీకు ప్రమోషన్లు వచ్చాయని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మహేశ్వరి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రమోషన్స్ అనంతరం కర్నూలు జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ జిల్లా కమిటీని నంద్యాల జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ కర్నూలు జిల్లా అధ్యక్షురాలుగా బిఎస్. అరుణ, కార్యదర్శిగా జి.సంధ్యారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మహేశ్వరమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి పద్మ, కోశాధికారిగా ధర్మావతి, ఉపాధ్యక్షులుగా పుష్పలత అహల్య, పుష్ప చాముండి, ఉమాదేవి వెంకటేశ్వరమ్మ , సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వరమ్మ, సంతోష్ అమ్మ విజయ కుమారి, రామలక్ష్మి, విజయలక్ష్మి, ఆరుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్ కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజనల్ మున్సిపల్ మండల కేంద్రాల్లోని కార్యాలయాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రతి గిరిజనుడికి సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

గిరిజన సంక్షేమ ఫలాలు ప్రతి గిరిజనుడికి అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి దేవి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ రెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని వరమాన్‌దొడ్డి తండా గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎంపిపి గిరిజమ్మ ఆదేశాల మేరకు సర్పంచి విజయభారతి అధ్యక్షతన గ్రామంలో జన భగీరధ అభియాన్‌ను ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామంలో 15రోజుల పాటు జరిగే జన భగీరధ అభియాన్ ద్వారా గిరిజనులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసిన విజన్ నుండి మిషన్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలు అందని ప్రతి గిరిజనుడు 15రోజుల్లో ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జీరా గణేష్, అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ, యంపిటిసి ఈరన్న, నాయకులు సత్యారెడ్డి, లక్ష్మన్న నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి, వేదికపై గిరిజన సంక్షేమ శాఖ ఇడి తులసిదేవి

మరో తిరుపతిగా మంత్రాలయం క్షేత్రం

-కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం క్షేత్రం మరో తిరుపతిగా మార్చే ప్రయత్నంలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌టిసి కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులతో పలు అభివృద్ధి విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఆయన శ్రీ మఠం సూచనల మేరకు ఆలయ సహకారంతో దేశంలో రెండవ తిరుపతిగా మంత్రాలయం క్షేత్రాన్ని మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బస్టాండును ఆధునికరించి ప్రయాణికులకు ఆర్వో ప్లాంట్ ద్వారా తాగు నీరు అందిస్తామన్నారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేయించే పని జరుగుతుందని, బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచి అదనంగా కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటుతో దొంగతనాలకు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని తెలిపారు. వెయిటింగ్ హాలు లాంజ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ఖాళీ స్థలాలను టెండర్ ద్వారా లీజుకు ఇస్తామని చెప్పారు. బెంగళూరు హైదరాబాద్ విజయవాడ తిరుపతి ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచడంతో పంచముఖి, తుంగభద్ర, ఎమ్మిగనూరు, మాధవరం మీదుగా ఆదోని, ఉరుకుంద ప్రాంతాలకు బస్ సర్వీసులు నడుపుతామన్నారు. కడప జోన్ పరిధిలో 250 ఎలెక్ట్రికల్ బస్సులు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మహిళలకు ఉచిత బస్ సౌకర్యం ఉంటుందన్నారు. తన జోన్ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీ శైలం, మంత్రాలయం ఉన్నాయని భక్తుల సౌకర్యాల కల్పనకు కషి చేస్తానని తెలిపారు. బస్టాండ్‌లో ఉన్న లీజు దుకాణాల అనుమతులు ఏ వ్యాపారానికి ఉన్నాయని, ప్రస్తుతం దుకాణాల నిర్వాహకులు ఏఏ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని విషయం తనకు నివేదిక ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తప్పవని డిఎంమద్దిలేటి నాయుడును హెచ్చరించారు. ఇక మీద లీజు విషయం పై టెండర్లు పత్రిక ద్వారా ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

-పీఠాధి పతులు సుభుదేంద్ర తీర్థులులో ఆర్‌టిసి కడప జోనల్ చైర్మన్ నాగరాజు

సినారె పాటలకు ప్రజాధారణ : వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సినారె తెలుగు సినిమా పాటలు ప్రజాధారణ పొందాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి టీజీవి కళాక్షేత్రంలో సినారే ఎనిమిదవ వర్ధంతి సభను నిర్వహించారు. పలువురు గాయకులు సినారే చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 1931లో జన్మించిన సి.నారాయణరెడ్డి 2017 జూన్ 12న మృతి చెందినట్లు తెలిపారు. ఆయన రచించిన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠం అవార్డు లభించిందన్నారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వంటి అవార్డులు ఎన్నో పొందరన్నారు. 3 వేలకుపైగా సినిమా పాటలు రచించారని, తెలుగు సాహిత్యంలో ఆయన రచించిన కావ్యాలకు పాఠకుల విశేష ఆదరణ ఉందన్నారు. అనంతరం సుధారాణి, మహమ్మద్ మియా, కె. బాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు గాయకులు సి.నారాయణరెడ్డి, ఘంటసాల పాడిన పాటలను వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సి వెంకట్ రెడ్డి, వ్యాఖ్యాత ఇనయతుల్లతో పాటు మహమ్మద్ మియా కన్వీనర్‌గా వ్యవహరించారు.

మాట్లాడుతున్న పత్తిఓబులయ్య

ఎర్ర వంకలో.. చిరుత కలకలం...

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక ఎర్ర వంకలో చిరుత ఆదివారం కలకలం రేపింది. పక్కనే ఉన్న కొండ ప్రాంతంలో నుంచి వంకలో నడుచుకుంటూ మత్తులో ఉన్న చిరుతను చూసి చుట్టుపక్కల రైతులు భయాందోళనకు గురయ్యారు. ఉదయం 11 గంటలకు చిరుత సంచరించడంతో స్థానిక రైతులు ఎస్ఐ హనుమంత రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు హెచ్చరికలు జారీ చేశారు. చిరుతకు ఎలాంటి హాని కలగకుండా గస్తీ నిర్వహించారు. గ్రామంలో ఒక్కసారిగా ఈ సమాచారం తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా చిరుతను చూసేందుకు తరలివచ్చారు. అదేవిధంగా అటవీశాఖ అధికారులకు సమాచారం తెలియడంతో డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల, ఫ్లయింగ్ స్క్వాడ్ రవిశంకర్, ఆదోని రేంజ్ ఆఫీసర్ తేజస్విలు చిరుతను బంధించేందుకు బోనును సిబ్బందితో కలిసి సిద్ధం చేశారు. గ్రామ యువకుల సహకారంతో చిరుతను బంధించారు. చిరుతమత్తులో ఉండడానికి గల కారణాలు తెలుసుకొని వెటర్నరీ డాక్టర్ ద్వారా చికిత్స చేయిస్తామన్నారు. చిరుతను బంధించే సమయంలో పక్కనే ఉన్న పత్తి పొలంలో తొక్కిసలాటలో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. చిరుతను బంధించేందుకు సహకరించిన గ్రామ యువకులను ప్రత్యేకంగా అటవీశాఖ అధికారులు అభినందించారు.



వివాదానికి ఆజ్యం పోస్తున్న అధికారులు

-మానేకుర్తిలో వివాదస్పదంగా కనక దాసు విగ్రహ ఏర్పాటు

-కోర్టు మధ్యంతర ఉత్తర్వులను భేఖతారు చేసిన నిర్వాహకులు, అధికారులు

ప్రజాశక్తి - ఆలూరు

మండల పరిధిలోని మానేకుర్తి గ్రామంలో వివాదస్పదంగా ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహ తొలగింపులో అధికారుల అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లు కనిపిస్తుంది. గ్రామంలో ఇప్పటికే కనకదాసు విగ్రహ ఏర్పాటు పై వివాదం నెలకొంది. నిబంధనల మేరకు కాకుండా జాతీయ రహదారి 167 స్థలంలో కనకదాసు విగ్రహ నిర్మించారని గ్రామంలో కొంతమంది కోరుతుండగా మరో కొంతమంది అక్కడే ఏర్పాటు చేస్తామని భీష్మించడంతో వివాదంగా మారింది. 2024 మర్చి నెలలో జాతీయ రహదారి 167 స్థలంలో విగ్రహ ఏర్పాటుకు పనులు చేస్తుండగా కొంతమంది గ్రామస్తులు జిల్లా కలెక్టర్, జాతీయ రహదారి, మండల రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసి విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణ పనులను ఆపాలన్నారు. జాతీయ రహదారి అధికారులు సంఘటన స్థలాని సందర్శించి సర్వే చేపట్టి జాతీయ రహదారి స్థలంలోనే విగ్రహ ఏర్పాటుకు చేపడుతున్న పనులను నిలిపి చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఐనప్పటికీ విగ్రహ నిర్వాహకులు రాత్రి సమయంలో నిర్మాణం చేపడుతుండగా నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చారు. ఇప్పటికే బేస్ లెవల్ కట్టేశారు.

కోర్టు మధ్యంతర ఉత్తర్వులను భేఖతారు

విగ్రహ నిర్మాణ పనులను ఆపాలని 2024 సెప్టెంబర్ 06న హై కోర్టులో కేసు వేయగా 2024 సెప్టెంబర్ 10న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విగ్రహ నిర్వాహకులు హైకోర్టు ఉత్తర్వులు బేకతారు చేస్తూ 2025 మే 18న మానేకుర్తి గ్రామంలో విద్యుత్ లేని సమయంలో రాత్రి 11గంటలకు కనక దాసు విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సంఘటన పై గ్రామస్తులు కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి విగ్రహం ఏర్పాటు చేశారని కలెక్టర్ స్పందించి ఫిర్యాదు చేయగా విచారించి విగ్రహాన్ని తొలగించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

విగ్రహం తొలగింపు లో అధికారుల జాప్యం....

ఎటువంటి అనుమతులు లేకపోయినా, కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉల్లంఘించి అక్రమంగా విగ్రహం ఏర్పాటు చేసినా తొలగించకపోవడంతో ఆలూరు తహశీల్దార్ గోవింద్ సింగ్ అండర్ సెక్షన్-7, అండర్ సెక్షన్-6 నోటీసులను జారీ చేసిన నిర్వాహకులు విగ్రహం తొలగించలేదు. ఐనప్పటికీ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో విగ్రహాని తొలగించాల్సి ఉండగా కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. హై కోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులపై ఫిర్యాదు దారుడు కంటెంట్ ఆఫ్ కోర్ట్ కింద పిటిషన్ వేస్తున్నట్లు తెలిపింది. గ్రామంలో కక్షలకు ప్రేరేపితం అవుతున్న విగ్రహ ఏర్పాటు పై న్యాయపరంగా అధికారులు ముందుకు వెళ్లకపోతే గొడవలు జరిగే అవకాశం ఉన్నందున్న జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంత్రాలయంలో మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి రాత్రి 9గంటలకు మంత్రాలయం వస్తున్న నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ఆదివారం మంత్రాలయంలోని పద్మనాభ తీర్థ అతిథి గృహానికి చేరుకున్నారు. శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సోదరులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసు రెడ్డి, టిటిడి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి సంతోష్ రావు, జెసి నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎస్ఇ ఉమాపతి, డిఇ విజయ్ కుమార్, ఆదోని డిఇఇ పురుషోత్తం, ఎడిఇ విశ్వ శాంతి స్వరూప్, ఎడి నాగేంద్ర, ఎఇఇ గోవిందు ఇతర అధికారులు శాలువలతో పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ఎల్లారెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు అమర్నాథరెడ్డి, బిసి సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి జ్ఞాపికను అందుకంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సోలార్‌తో విద్యుత్ ఆదా

విద్యుత్ శాఖ ఏఈ. నరసన్న

కౌతాళం- ప్రజాశక్తి

ప్రతి కుటుంబం విద్యుత్తు ఆదా చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇప్పుడు సోలార్ విద్యుత్ వినియోగించుకుంటే 25 సంవత్సరాల వరకు కరెంట్ బిల్లులకు డోకా ఉండదని విద్యుత్ శాఖ ఎఇ నర్సన్న పేర్కొన్నారు. ఆదివారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అవగాహన సదస్సు నిర్వహించారు. సోలార్ విద్యుత్ అవగాహనపై విద్యుత్ సిబ్బంది కౌతాళం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎఇ నరసన్న మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యువజన పథకాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. దీని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని, తద్వారా తమ డబ్బులను పోగు చేసుకోవచ్చన్నారు. 120 యూనిట్లు లోపు వాడుకున్న వారికి రూ.30,000 సబ్సిడీ ఉంటుందని, 240 యూనిట్లు వాడుకున్న వారికి రూ.60,000 సబ్సిడీ ఉంటుందని ప్రజలు ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం ఉంటుందని సూచించారు. ప్రతి కుటుంబం విద్యుత్ ఆదా చేసుకుంటే ప్రతి ఒక్కరికి డబ్బు విద్యుత్ పొదుపుగా ఉంటుందని పూరవీధుల్లో నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో విద్యుత్ సోలార్ మేనేజ్‌మెంట్ నాగరాజు , విద్యుత్ సిబ్బంది ఎఇ.నర్సన్న, ఉరుకుంద లైన్మెన్ బద్రి, బదినే హాల్ లైన్మెన్ కరీం బాషా, టౌన్ లైన్మెన్ చెన్నబసవ స్వామి ,ఎరిగేరి అసిస్టెంట్ లైన్మెన్ క్రిష్టప్ప, గ్రేట్ టు జిఎల్ఎం పోల్ టు పోల్ వర్కర్ సబ్ స్టేషన్ ఆపరేటర్స్ , బిల్ రీడర్స్ అందరూ ఈ సదస్సులో పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న కంప్యూటర్ గది

- నాసిరక నిర్మాణమే కారణం

ప్రజాశక్తి-చిప్పగిరి

చిప్పగిరిలోని స్థానిక రక్షక భటుల నిలయంలో కంప్యూటర్ గది, రైటర్ ఉన్న గదులలో పెచ్చులు ఎప్పుడు ఊడిపోతాయో మా మీద ఎప్పుడు పడతాయోనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రక్షక బటుల నిలయం నిర్మించి 12 సంవత్సరాలయింది. ఇంత త్వరగా పై పెచ్చులు ఊడిపోతునడంతో ఇంత నాసిరకంగా కట్టారని స్థానిక పోలీసులు ఆవేదన చెందుతున్నారు. కంప్యూటర్ మీద పెచ్చులూడి అలా నిలిచి పోయాయి. లేనిపక్షంలో మా మీదనే పడి ఉండేవని, ఆందోళన వ్యక్తం చేశారు. పది కాలాలపాటు భద్రంగా ఉండే ప్రభుత్వ భవనాలు నాసిరకంగా నిర్మిస్తే ఎప్పుడు పడిపోతాయో కూడా తెలియదని ప్రజలు నివ్వెర పోతున్నారు. దయచేసి కాంట్రాక్టు దారులు ప్రభుత్వ భవనాలను నాసిరకంగా కాకుండా పది కాలాలపాటు పనికొచ్చేలా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్ కలెక్టర్ ను కలిసిన తహసీల్దార్

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని తహశీల్దార్ గా రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యత యుతంగా విధులు నిర్వర్తించి సేవలు అందించాలని సబ్ కలెక్టర్ సూచించారు.

వృద్ధులను చేరదీద్దాం...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణంలో స్థానిక రెవిన్యూ భవనంలో వృద్ధుల సంరక్షణపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లీల్ సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వృద్ధులను గౌరవించే పద్ధతులను వివరించారు. వారి విలువలను తెలియజేస్తూ వృద్ధాశ్రమాల్లో చేర్చకుండా ప్రేమాభిమానాలతో చూసుకోవాలని చెప్పారు. వృద్ధులను చేరదీసి ఆదరిద్దామని అన్నారు. వారి సంరక్షణకు కట్టుబడి ఉందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా కోర్ట్ నామినేట్ మెంబర్ మమత లోకేష్ కుమార్, ప్యానల్ మెంబర్స్ కళ్యాణ్‌రెడ్డి, బాలకృష్ణ, రామలింగ పాల్గొన్నారు.

చౌక బారు విమర్శలు మానండి

- ఆలూరు అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి- దేవనకొండ

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి టిడిపి ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు మానుకొని ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం చేయాలని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ బొజ్జమ్మ అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎంపిటిసిలకు, సర్పంచులకు జీతాలు ఇవ్వలేదని మాట్లాడడం సమంజసం కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో సర్పంచుల నిధులు దారి మళ్లించిన సంగతి విస్మరించారన్నారు. గ్రామాలలో వీధిలైట్లు, మురుగు కాలువలు, క్లీన్ చేయడానికి, కాలిపోయిన మోటార్లు కట్టించడానికి సర్పంచులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటినుండి సర్పంచులకు కేంద్రం ఇచ్చిన నిధులు ఏ ప్రభుత్వం దారి మళ్ళించలేదని, నిధులను దారి మళ్లించింది జగన్ ప్రభుత్వమే అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. పిల్లలు ఎంతమంది బడికి వెళుతున్నారో అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పామని, అమలు చేస్తున్నామన్నారు. టిడిపి ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాలు జీర్ణించుకోలేక ప్రభుత్వం పై విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో చిప్పగిరి జడ్పిటిసిగా ఉన్నప్పుడు ఎంతవరకు ఆ మండలాన్ని అభివద్ధి చేశారని గుర్తు చేశారు. చౌకబారు విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదు ఈ పద్ధతి మార్చుకోకపోతే మీకు ప్రజలు మరొకసారి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం

ప్రజాశక్తి-కౌతాళం: అర్హులైన వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు జమ చేస్తున్నామని బదినేహాల్ గ్రామ హైస్కూల్ చైర్మన్ శేక్షావలి, టిడిపి యువ నాయకులు నరసింహులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయంలో అమ్మఒడి పథకం కింద ఒక ఇంట్లో ఒక విద్యార్థికి మాత్రమే రూ.13000 ఇచ్చే వారు కూటమి ప్రభుత్వం మాత్రం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం పథ కాన్ని వర్తింపజేస్తుండడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. బదినేహళ్ గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారం సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం చేరడంతో వైసిపి ప్రభుత్వం వారి పార్టీ శ్రేణుల్లో వణుకు పుట్టిందని, నోటి మాటలు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రికి, విద్యాశాఖ లోకేష్ బాబు కు గ్రామ ప్రజలు, టిడిపి నాయ కులు నరసింహులు, హైస్కూల్ చైర్మన్ షేక్షాలి, ఈరన్న, షబ్బీర్, గోపాల్, వలి, వీరష్, జనసేన నాయకులు ఆలం బాష సాయి బన్ని, చిన్న, బిజెపి నాయకులు, రమేష్ కూటమి కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

వాహన మిత్ర వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత ప్రభుత్వం ఓనర్ కమ్ డ్రైవర్ లందరికీ వాహన మిత్ర పథకం ద్వారా రూ.పదివేల ప్రభుత్వం ఇచ్చిందని కూటమి ప్రభుత్వం కూడా అర్హులందరికీ వర్తింప జేయాలని ఎపిఆటోఅండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు మండల ఆటో కార్మికుల సమావేశం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయం కొత్త బస్టాండ్ సమీపంలో కల్లూరు మండల ఆటో యూనియన్ అధ్యక్షులు మధు అధ్యక్షతన నిర్వహించారు. కె. ప్రభాకర్, సిఐటియు కల్లూరు మండల కార్యదర్శి మధు మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అనేక వాగ్దానాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే పై సమస్యలపై స్పందించకుంటే జులై 9న కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెలో ఆటో డ్రైవర్లు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటారని వారన్నారు. అనంతరం ఆటో కార్మిక సంఘం సిఐటియు కల్లూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల అధ్యక్షులుగా శ్రీరాములు (పెద్దపాడు), ప్రధాన కార్యదర్శిగా నాగార్జునుడు (మార్కాపురం), కోశాధికారిగా మురళి, కమిటీ ఉపాధ్యక్షులుగా ఈశ్వర్ అమర్నాథ్ రెడ్డి, మధు, సూర్య మల్లయ్య, నడిపి బీచ్‌పల్లి, మధు, కార్యదర్శులుగా మౌలాలి ప్రతాప్, మధు ,నాగన్న, శాలుమియా, 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. పెద్దపాడు, ఉలిందకొండ, గోకులపాడు, సల్కాపురం నేరవాడ, చిన్న కొట్టాలు, మార్కాపురం, పెద్ద కొట్టాలు, పర్ల, బొల్లవరం, పుసులూరు తదితర గ్రామ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నరసింహను అభినందిస్తున్న నాయకులు బడేసాహెబ్ , అజయ్, నగేష్ తదితరులు

నీట్ ఉత్తమ ర్యాంకు సాధించిన నరసింహకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నీట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకు సాధించిన నరసింహను ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో అభి నందించారు. ఈ అభినందన కార్యక్రమం ఆదివారం ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కెకె భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్, నగర నాయకులు ఆర్యన్, ఆదిత్య మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బడే సాహెబ్ , అజయ్, ఎల్లాగౌడ్, నాగేష్, ముని స్వామి, రంగస్వామి,వెంకటేష్ రాఘ వేంద్ర, నాయుడు, ప్రజా సంఘాల నాయకులు గురుశేఖర్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. కుటుంబం కర్నూలు నగరంలో నివాసం ఉంటూ చాకలి వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న చాకలి శేషాద్రి, చాకలి మద్దమ్మ కుమారుడు నరసింహ నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటాడు. నీట్ పరీక్షకు ప్రిపరేషన్ కోసం ఎటువంటి కాలేజీలో చేరకుండా ఆన్‌లైన్‌లో క్లాసులు వింటూ సొంత ప్రయత్నం ద్వారానే నీట్ పరీక్షలో 602 మార్కులతో 4392 ర్యాంకు సాధించాడు. చదువు పోరాడు నినాదంతో ఎస్ఎఫ్ఐ లో విద్యార్థి ఉద్యమంలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యల పరిష్కా రానికి తన వంతు కషిని చేస్తూ చదువును పోరాటాన్ని సమానంగా ముందుకు తీసుకుపోతూ నీట్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచాడు.

ఇచ్చిన హామీని నిలుపుకున్న సీఎం

ప్రజాశక్తి-ఆదోని

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అన్ని వర్గాల మన్నన పొందుతున్న సిఎం చంద్రబాబుకు అండగా ఉందామని టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. ఆదివారం ఆర్ట్స్ సైన్స్ కళాశాల వద్ద ఆయన కార్యాలయంలో సాయం పొందిన తల్లులు, చిన్నారులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఉమాపతి నాయుడు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. బడికి వెళ్లే కుటుంబంలోని చిన్నారులందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చిన ఘనత బాబుకి దక్కిందన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండే సూపర్ సిక్స్ పథకాలలో దశలవారీగా అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం కల్పించి సుస్థిర పాలనకు అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని గ్రహించాలన్నారు. స్కూలు ప్రారంభం రోజునే ఒక్కో విద్యార్థికి రూ 13 వేలు సాయం అందడంతో పేద తల్లుల కళ్ళల్లో ఆనందం చిన్నారులలో విశ్వాసం పెంపొంది తమ చదువుకు డోకా లేదన్న నమ్మకం కలిగిందన్నారు. ఆదోని నియోజవర్గ టిడిపి మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ప్రజల్లోమమేకమై సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సాయం అందని అర్హులను గుర్తించి రెండో విడతలో లబ్ధి పొందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి, శంకర్, మల్లికార్జున, గనేకల్ విరుపాక్షి, అన్వర్ బాష, అయ్యన్న, శ్రీనివాసాచారి, లక్ష్మీనారాయణ, బసవరాజు, కృష్ణారెడ్డి, సోమనాథ్, నాగరాజ్, వలమన్న, నెట్టేకల్ ఈరన్న, లక్ష్మన్న, బొజ్జ రెడ్డి, ఈరన్న, ధన సింగ్, నాగప్ప, సయ్యద్ ఉన్నారు.

Before The Motor Accident Claims Tribunal-cum-X ADJ: Tirupati
MVOP No.88/2022

C.Parijatham and Others ...Petitioners

Vs

Boya Ramesh And Others .... Respondents

NOTICE TO RESPONDENT No.1

Boya Ramesh,
S/o Ramadasu, D No. 18-240/3,
Shanmukha Reddy Nagar,
Kodumuru, kurnool Dist.

Please take Notice that the above O.P filed by the petitioner under section 166 1(C) of M.V Act against you for compensation Of Rs. 20,00,000/- in the above MVOP. The matter is posted for Notice and your appearance on 20.06.2025 Please take Notice and appear before the Hon'ble Court on 20.06.2025 at about 10.30 a.m either in person or through counsel falling which the matter will be decided in your absence
Hearing Date : 20.06.2025.

D. Ramakrishna, B.Com.,B.L.,
O. Bhaskar, M.Com.,B.L.,
C. Chandrasekhar, M.A.,L.L.B
Advocates, Tirupati.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు : పత్తికొండ
ఓ.ఎస్. నెంబర్. 155/2020

కె.దామోదర ఆచారి. ...వాది

విధిరి

వై.వి.ఎస్.ప్రసాద్. ...ప్రతివాది

ప్రతివాది అయిన నీకు దావా సమన్లు

ప్రతివాది :
వై.వి.ఎస్.ప్రసాదు, తండ్రి వై.క్రిష్ణమూర్తి,
వయస్సు 58 సం॥లు, ఎంప్లాయి, సూపరిన్‌టెండెంట్,
డి.పి.ఓ. ఆఫీస్, జిల్లా పరిషత్, కర్నూలు టౌన్,
రెసిడెంట్ ఆఫ్ ఇ.నెం.78/8ఎ112-2-34,
న్యూ క్రిష్ణ నగర్, కర్నూలు టౌన్ & జిల్లా.

పై నెంబరు గల దావాను వాది, ప్రతివాది అయిన నీపై, పై తెలిపిన కోర్టు నందు, ప్రామిసరినోటు బాకీ మొత్తము రూ.1,00,000/- లను రాబట్టుకొనుటకు గాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాది అయిన నీయొక్క హాజరు నిమిత్తము పై కోర్టులో తేది 23-06-2025న ఉదయం గం॥ 10.00 ని॥లకు పై తెలిపిన కోర్టులో నీవు స్వయముగాగాని లేదా వకీలు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకొనవలయును లేనియెడల నీ పరోక్షమున తీర్మానించబడును.

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 23-06-2025

ఇట్లు
బి. రమేష్ బాబు ,
జి. భాస్కర్,
వాది పరము న్యాయవాదులు.
పత్తికొండ - 518 380.
కర్నూలు జిల్లా.

IN THE COURT OF THE PRINCIPAL FAMILYJUDGE COURT AT BALLARI
Crl. M.C. No: 155/2024

Between:
M.Mamatha and other ...Petitioners
And
Mitayi Lepakshappa ...Respondent

NOTICE RESPONDENT

To,
Mitayi Lepakshappa S/o Mitayi Mallikarjuna, aged about 32 years, R/o. H.No 2-159, Danapuram Village, Adoni Taluk, Kurnool District
Workin at: Mitayi Lepakshappa S/o Mitayi Mallikarjuna, aged about 32 years, R/o H.No.21,14th Main Road, near Panchamukhi Hanuman Temple, Indira Colony, RPC Layout, Attihiguppe, Vijayanagara, Bengaluru.

WHEREAS the above named petitioner has filed the above petition against the respondant seeking maintenance. Therefore you are hereby, directed to appear in this Court in person or by A Pleader duly instructed on 10th day of July 2025 at11.00 A.M.before this Court to answer the claim in your defence and also to produce on the said day all the document in your possession, failling which the petition will be heard and determined ex-parte.

Given under my hand and seal of the Court on this 6th day of June 2025.

By Order of Court

P.Anand Rao, Advocate for the petitioner, | **Shiristedar** Hon'ble Principal Family Court at Ballari.